క్లుప్తంగా

విద్యార్థులకు పోటీతత్వం అవసరం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

బాలాజీచెరువు: ప్రతి విద్యార్థీ పోటీతత్వాన్ని అలవాటు చేసుకోవాలని రోటరీక్లబ్ కాకినాడ అధ్యక్షుడు గోపి కాశీవిశ్వనాథ్ పేర్కొన్నారు. వీబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖన, వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు మంగళవారం వివేకానంద పార్కు గ్రంథాలయంలో బహుమతులు అందజేశారు. నగరంతో పాటు రూరల్‌కు చెందిన 43 పాఠశాలల విద్యార్థులు 282 మంది పాల్గొనగా 72 మంది విజేతలకు బహుమతులు అందజేశారు. బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ, బాలల సైన్స్ కాంగ్రెస్ కో–ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు, వీబీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు కె.సత్యనారాయణ, గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి దశావతార అలంకార మహోత్సవాలు

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో ఈ నెల 23 నుంచి డిసెంబర్ 10 వరకూ రజిత చిన్న దశావతార అలంకార ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ప్రధాన అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు మంగళవారం విలేకరులకు తెలిపారు. 23న మహావిష్ణు అలంకరణ, 24న శేషశయన, 25వ తేదీ నుంచి డిసెంబర్ ఐదో తేదీ వరకు దశావతారాల్లో, 6న జగన్మోహినిగా, 7న వేంకటేశ్వరునిగా, 8న లక్ష్మీహయగ్రీవునిగా, 9న ధన్వంతరిగా, 10న విశ్వరూప దర్శనాల్లో భక్తులకు స్వామివారు దర్శనమిస్తారన్నారు. ఈ నెల 24న క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా స్వామికి ద్వాదశ ప్రదక్షిణలు, సహస్ర దీపాలంకరణ, విశేషపూజలు జరుగుతాయన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీజట్టుకు గురజనాపల్లి విద్యార్థినులు

కరప: కర్నూలు జిల్లా ఆదర్శ విద్యామందిర్‌లో మంగళవారం జరిగిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టులో పాల్గొన్న మండలం గురజనాపల్లి పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపడంతో ఇద్దరు రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్టు హెచ్‌ఎం ఎ.సాయి మోహన్ తెలిపారు. ఈ పోటీలో పాల్గొన్న రగ్బీ జట్టుకు ద్వితీయస్థానం లభించిందన్నారు. గురజనాపల్లి హైస్కూలు నుంచి జ్యోతిచంద్రిక, సునంద తేజశ్రీ, కళ్యాణి, మహాలక్ష్మి, ఝాన్సీ, సాయిమౌనిక ఉమ్మడి తూర్పు గోదావరిజిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. వీరిలో ఉత్తమప్రతిభ కనబరచిన వై.జ్యోతిచంద్రిక, పి.సునందతేజశ్రీ ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికయ్యారని హెచ్‌ఎం తెలిపారు. వచ్చే నెలలో పూనేలో జరిగే జాతీయ స్థాయి రగ్బీ పోటీలలో పాల్గొంటారన్నారు. గురజనాపల్లి పీడీ కె.నాగలింగేశ్వరరావును కర్నూలు జిల్లా డీఈఓ రంగారెడ్డి సత్కరించినట్టు ఆయన చెప్పారు. ప్రతిభచూపిన క్రీడాకారులను హైస్కూలు ఉపాధ్యాయులు అభినందించారు.

మద్యం అక్రమ తరలింపుపై 9 కేసులు

కాకినాడ క్రైం: జిల్లా వ్యాప్తంగా పలు సెబ్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో భారీ మొత్తంలో నాటుసారా, బెల్లపు ఊట స్వాధీనం చేసుకున్నట్టు సెబ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సీహెచ్ అజయ్‌కుమార్‌సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాజా దాడుల్లో 38 లీటర్ల నాటుసారా, 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి తొమ్మిది కేసుల్లో 8 మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్టు తెలిపారు. సబ్ జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ప్రేమ్ కాజల్ ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించినట్టు తెలిపారు.

విద్యా సంస్థల్లో ఫీజు రాయితీ కల్పించండి

కాకినాడ సిటీ: జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యా సంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కృతికాశుక్లాను కలెక్టరేట్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఫీజు రాయితీ ఇస్తున్నారని వారు వివరించారు. ఫెడరేషన్ నాయకులు వి.నవీన్‌రాజ్, ముమ్మిడి లక్ష్మణ్, వీధి గోపీనాథ్, పుర్రె త్రినాథ్, దాసరి శ్రీనివాస్, చిరంజీవి కుమార్, సుధీర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 8న అంగన్‌వాడీల సమ్మె

కాకినాడ సిటీ: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ డిసెంబర్ 8వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధ సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి అన్నారు. మంగళవారం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ ఆయాలు, మినీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఆమె కోరారు. అంగన్‌వాడీ నాయకురాళ్లు దడాల పద్మ, ఏరుబండి చంద్రవతి, బాలంలక్ష్మి పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- ఇళ్ల స్థలాల పంపిణీ

కాకినాడ రూరల్: మత్స్యకారులకు అండగా ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు చేపడుతోందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలంలోని సూర్యారావుపేటకు చెందిన మత్స్యకారులకు మంగళవారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. రమణయ్యపేట సర్పవరం జంక్షన్ వద్ద మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో తహసీల్దార్ మురార్జీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 78 మందికి పట్టాలు పంపిణీ చేశారు. మిగిలిన వారికి వారం పది రోజుల్లో పంపిణీ చేస్తామన్నారు. నేమాం–4 లే అవుట్‌లో కేటాయించిన స్థలాలను అధికారులు అప్పగిస్తారని, గృహ నిర్మాణాలు చేపట్టాలని ఆయన సూచించారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని మత్స్యకారులకు ఇళ్ల పట్టాల పంపిణీ చేపట్టామని, అయితే ఇద్దరు మత్స్యకారులు మృతి చెందడంతో కార్యక్రమాన్ని



మత్స్యకారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కొందరికే పరిమితం చేశామన్నారు. ఈ సందర్భంగా మృతులకు సంతాపం తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు ఏటా వేట నిషేధ భృతిగా మత్స్యకార భరోసా, వేట సమయంలో ఎవరైనా మృతి చెందితే పరిహారం అందిస్తోందన్నారు. డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీవో స్వప్న, సూర్యారావుపేట మత్స్యకార సంఘ నాయకుడు సూరాడ రాజు, నేమాం సర్పంచ్ రామదేవు చిన్న, డిప్యూటీ తహసీల్దార్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తివిద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు



ఆక్వా ప్రతినిధులను సత్కరిస్తున్న శేషారెడ్డి

బాలాజీచెరువు: వృత్తికోర్సులతో ఉపాధి అవకాశాలు త్వరగా వస్తాయని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆదిత్య కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యూజీసీ ఉపాధి కోర్సులను ప్రవేశపెట్టిందని, అవి మానవుని నిత్యజీవితంతో ముడిపడేలా ఉన్నాయన్నారు. తరగతి గదుల కంటే ప్రాక్టికల్స్‌కు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా వారిలో ఆలోచించే విధానం మరింత పెరిగి సబ్జెక్టుకు మరింత దగ్గరవుతారన్నారు. జిల్లాలో ఇటీవలే ఆక్వా రంగం బాగా పెరిగిందని, అలాగే వాటికి తగ్గ పరిశ్రమలు ఉన్న నేపథ్యంలో వాటితో ఒప్పందాలు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆక్వారైతులు, ప్రతినిధులను సత్కరించారు. కళాశాల డైరెక్టర్ సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు, మత్స్యశాఖ అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.

సుందరయ్య భవన్‌లో మత్స్యకార దినోత్సవం

కాకినాడ సిటీ: స్థానిక సుందరయ్యభవన్‌లో ఉప్పాడ సత్యనారాయణ అధ్యక్షతన ఏపీ మత్స్యకారుల మత్స్య, కార్మిక సంఘం ఆధ్వర్యంలో మత్స్య దినోత్సవం నిర్వహించారు. కేంద్రంలో బ్లూ ఎకానమి మత్స్యకారుల హక్కులు హరించే విషయంపై వక్తలు మాట్లాడారు. మత్స్యకార సంఘ నాయకులు సీహెచ్ రమణి, ఎం.రాజశేఖర్, హరమ్మ, చిన్న, అప్పలనరస, లోకాలమ్మ, స్వరూప, రాజు, వీరమణి, నూకరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సుందరయ్యభవన్, కొత్తపేట మార్కెట్, ఘాటీ మార్కెట్, పెద్దమార్కెట్, జగన్నాథపురం, చినమార్కెట్, రమణయ్యపేట మార్కెట్, ఇంద్రపాలెం మార్కెట్ల వద్ద సంఘం జెండాలను ఆవిష్కరించారు.

జగన్‌తోనే పేదల జీవితాల్లో వెలుగులు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- వేములవాడలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

కరప: పేదవారి కష్టాలు తీర్చడానికి, కన్నీళ్లు తుడవటానికి నేనున్నానని ధైర్యం చెప్పి, వాళ్ల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి జగన్ ఒక్కరేనని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చిన సీఎం జగన్ దేశంలోనే ఆదర్శంగా నిలిచారన్నారు. మండలం వేములవాడ సచివాలయం వద్ద సర్పంచ్ కమిడి మంగాదేవి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్'లో ఆయన మాట్లాడారు. వలంటీర్ల ద్వారా ఇంటకొచ్చి పింఛన్ ఇవ్వడం, ఇంటింటికీ రేషన్ పంపిణీ, ప్రజల ఆరోగ్యమే ధ్యేయం ఫ్యామిలీ డాక్టర్ తదితర 32 రకాల పథకాలు అమలుచేస్తున్న సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో 650 హామీలిచ్చి 10 కూడా అమలుచేయకుండా, మళ్లీ మాయమాటలు చెప్పడానికి తయారయ్యారని, దీనిని ప్రజలు గమనించాలన్నారు.



వేములవాడ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

నిజాయితీగా పనిచేస్తున్న ఒక్కడిని ఓడించడానికి 10 మంది కలిసి వస్తున్నారని, వారు చెప్పే మాటలగారడీలో పడవద్దన్నారు. ప్రజలకు చేసే మేలు చెప్పకుండా, జగన్‌ను ఓడించడమే అజెండా పెట్టుకున్న ప్రతిపక్షం వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. అవినీతికి పాల్పడి అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు ఆరోగ్యం బాగోలేదని, మధ్యంతర బెయిల్ పొంది బయటకువచ్చారన్నారు. పూర్తిస్థాయి బెయిల్ పొందటమనేది కోర్టులో జరిగే సాధారణ ప్రక్రియ, దానికి టీడీపీ వాళ్లు పండగచేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆరోగ్య సమస్యలున్న చంద్రబాబు మళ్లీ ఎలా తిరగకలరనేది ప్రజలే ఆలోచించాలన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న తనను ఎమ్మెల్యేగా, ముఖ్యమంత్రిగా జగన్‌ను వచ్చే ఎన్నికల్లో మద్దతు పలకాలని ఎమ్మెల్యే కోరారు. ముందుగా నోడల్ అధికారి, ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో డీబీటీ, నాన్‌డీబీటీ, ఇతర అభివృద్ధి కార్యక్రమాల ద్వారా రూ.41.81 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సచివాలయ పరిధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. తర్వాత గ్రామ కూడలిలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, ఎంపీటీసీ పాలిక శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కమిడి సీతామహాలక్ష్మి, సర్పంచ్‌లు మంగాదేవి, వాసంశెట్టి రామారావు, సాదే ఆశాజ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, బండే తాతాజీ, విత్తనాల శ్రీను పాల్గొన్నారు.

రబీలో ప్రతి ఎకరాకూ సాగునీరు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- కరప మండల సమావేశం

కరప: రబీలో ఒక్క ఎకరా కూడా ఎండకుండా సాగునీరిందేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, రైతులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు స్పష్టంచేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.10.32 లక్షల మిగులు బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. స్థానిక మండలపరిషత్ సమావేశమందిరంలో మంగళవారం ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కన్నబాబు వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. డ్రైనేజీ, ఇరిగేషన్, ఆర్ అండ్‌బీ, ఎక్సైజ్, ఐసీడీఎస్, వెలుగు తదితర శాఖల అధికారులు రాకపోవడంతో ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేసి వారిపై కలెక్టర్‌కు లెటర్ పెట్టాలని ఎంపీడీఓ కె.అప్పారావును ఆదేశించారు. రబీలో సాగునీటి సరఫరాపై సమీక్షించాల్సి ఉండడంతో ఇరిగేషన్, డ్రైనేజీశాఖల ఈఈ కె.ఏడుకొండలు, డీఈఈ జి.శేషగిరిరావులకు ఫోన్‌చేయించడంతో వారు సమావేశానికి హాజరయ్యారు. శివారు ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా రూ.6 కోట్లతో కాలువల్లో పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపునకు ప్రతిపాదనలు పంపంపామని, రూ.1.08 కోట్లతో 20 చోట్ల అడ్డుకట్టలు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రూ.40 లక్షలతో గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు తీసుకున్నామని వారు ఎమ్మెల్యేకు వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

రబీ ప్రారంభానికి నీరొదిలే సమయానికి ఈ పనులన్నీ సకాలంలో పూర్తిచేయించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. రైతులను ఆదుకోవడానికి రబీలో పూర్తి ఆయకట్టుకు సీఎం జగన్ అనుమతించారని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయొద్దని ఆయన ఆదేశించారు. మార్చి నెలాఖరుకు కాలువలు మూసివేస్తున్నందున 120 రోజుల్లో కోతకువచ్చే రకాలు పండించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో చేపట్టిన పనులను వెంటనే పూర్తిచేయించాలని పంచాయతీ రాజ్ ఏఈఈ జి.శైలజను ఆదేశించారు. తర్వాత వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. తర్వాత విశ్రాంత ఉపాధ్యాయులతో ఆయన సమావేశమై వారు చెప్పిన సమస్యలు పరిష్కరిస్తామన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం తరఫున వారు ఎమ్మెల్యేను సత్కరించారు.

ఎంపీడీఓ కె.అప్పారావు సూచనల మేరకు 2023–24 సవరణ బడ్జెట్, 2024–25 ఆర్థికసంవత్సరానికి అంచనా బడ్జెట్ చదివి వినిపించి, సభ్యుల ఆమోదానికి ప్రవేశపెట్టారు. స్టాంపు డ్యూటీపై సుంకం, తలసరి గ్రాంటు, వేలాల ద్వారా, ఉపాధి పథకం తదితరాల ద్వారా వచ్చే అన్నిపద్దులు కలిపి 34,52,99,100 ఆదాయం గాను, రూ.34,42,67,000 వ్యయం గాను, రూ.10,32 లక్షలు మిగులు బడ్జెట్‌గా చూపించారు. సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, విద్యుత్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ ఏఈఈలు సానా ఈశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీదేవికి పంచామృతాభిషేకం



శివాలయంలో పూజలు చేస్తున్న ముత్తైదువలు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో పార్వతి సమేత త్ర్యంబకేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా మంగళవారం ముత్తైదువులతో పంచామృతాభిషేకం, విశేష పూజలను నిర్వహించారు. ఆలయ అర్చకుడు చైతన్య, ఇతర అర్చకులు మహిళలతో తొలుత విఘ్నేశ్వరపూజ, కుంకుమపూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నందిబాబు, సభ్యులు రాజబాబు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

పెద్దాపురం: ప్రతిఒక్కరిపైనా బాల్య వివాహాల నిర్మూలన బాధ్యత ఉందని పెద్దాపురం ఐసీడీఎస్ సీడీపీఓ ఉష, వెలుగు ఏపీఎం సూర్యనారాయణ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం బాల్య వివాహాల చట్టాలపై యానిమేటర్లు, మహిళా సమాఖ్య సంఘాల ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమాదేవి అధ్యక్షత వహించారు. ఉష, సూర్యనారాయణ మాట్లాడుతూ బాల్య వివాహాలు ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. బాల్య వివాహాలు చేస్తున్నట్టు తెలిస్తే 1098, 100 వంటి టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలన్నారు.

బాధిత యువతికి దిశ రక్ష



యువతి సమస్యను తెలుసుకుంటున్న దిశ సిబ్బంది

కాకినాడ క్రైం: కాకినాడకు చెందిన ఓ యువతి యువకుడి చేతిలో వేధింపులకు గురైన నేపథ్యంలో దిశ యాప్ అండగా నిలిచింది. వివరాల్లోకి వెళితే నగరానికి చెందిన ఓ యువతి తన పూర్వపు సహ విద్యార్థి తరుణ్ చేతుల్లో కొన్నాళ్లుగా వేధింపులకు గురవుతోంది. చదువుకున్న రోజుల్లో తన వద్ద ఉన్న ఫొటోలు మార్ఫింగ్ చేసి యువతిని బ్లాక్‌మెయిల్ చేస్తూ వక్రబుద్ధి చూపించి కొన్నాళ్లుగా వేధిస్తున్నాడు. మంగళవారం ఆమె ఇంటి నుంచి బయలుదేరగా ఆమె వెంటపడి బెదిరించడం మొదలుపెట్టాడు. దీంతో దిశ యాప్ ద్వారా పోలీసులను ఆశ్రయించింది. తక్షణమే అక్కడకు చేరుకున్న పోలీసులు యువతిని రక్షించారు. వారిని చూసి తరుణ్ పరార్ కాగా సాయంత్రానికి గాలించి కాకినాడ త్రీటౌన్ పోలీసుస్టేషన్‌కు చేర్చారు. తరుణ్‌కు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి హెచ్చరించారు. దిశ యాప్ ద్వారా తాను రక్షణ పొందానని యువతి పోలీసులకు ధన్యవాదాలు తెలిపింది. దిశ యాప్ సత్ఫలితాలనిస్తోందని, యువతులు, మహిళలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సతీష్‌కుమార్ చెప్పారు.

బాధిత కుటుంబాలకు సత్వర సాయం

ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



బాధిత మత్స్యకార కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: సముద్రంలో చేపల వేటకు వెళ్లి బోటు తిరగబడి మృతి చెందిన స్థానిక దుమ్ములపేటకు చెందిన మత్స్యకారుడు మైలపల్లి కృపదాసు, సూర్యారావుపేటకు చెందిన గరికిన సత్తిరాజు కుటుంబాలను ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మంగళవారం పరామర్శించారు. జీజీహెచ్ మార్చురీ వద్ద మృతుల కుటుంబాలను ఓదార్చారు. ఈ ఘటనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని, ఆయన ఆదేశాలన మేరకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు, మరో రూ.5 లక్షల బీమా సొమ్ము వేగంగా వచ్చేలా కృషి చేస్తామన్నారు. కలెక్టర్ కూడా సత్వర చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఇద్దరు కుటుంబ పెద్దలను కోల్పోవడం ఆయా కుటుంబాలకు పూడ్చలేని లోటని, అయితే ప్రభుత్వపరంగా సహాయాన్ని అందించి ఆ కుటుంబాలకు మనోధైర్యం కల్పించాలన్నదే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమన్నారు. ద్వారంపూడి వెంట మత్స్యకార ప్రతినిధులు వాసుపల్లి కృష్ణ, వాసుపల్లి రాంబాబు, ఎరుపల్లి సీతారామ్, మోసా జాన్ తదితరులు ఉన్నారు.

పథకాలకు అర్హతే ప్రామాణికం



పథకాల లబ్ధి బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

'వై ఏపీ నీడ్స్ జగన్'లో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు అర్హతే ప్రామాణికమని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 40, 41 డివిజన్లకు సంబంధించి రామారావుపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహించారు. సందర్భంగా సంక్షేమ పథకాల ప్రదర్శన బోర్డును ఆయన ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వైఎస్ఆర్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు హాజరయ్యారు. సాంకేతికకారణాల వల్ల కానీ, అర్హత ఉండి కానీ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావచ్చునన్నారు. నగరంలో దాదాపు 96 వేల కుటుంబాలు ఉండగా 84 వేల కుటుంబాలకు సంక్షేమ పథకాల లబ్ధి అందుతోందన్నారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రాంతంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, స్థానిక నాయకులు ఇనుకొండ పట్టాభిరామయ్య, గోడి సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి కులగణన

కమిషనర్ నాగ నరసింహారావు



కులగణనపై మాట్లాడుతున్న కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 27వ తేదీ నుంచి కులగణన–2023 నిర్వహించనున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. వారం రోజులపాటు జరిగే ఈ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం పాల్గొన్న ప్రత్యేకాధికారులు, నోడల్ అధికారులు, సచివాలయ అడ్మిన్లు, వెల్ఫేర్ సెక్రటరీలకు కమిషనర్‌తో పాటు, ముఖ్య ప్రణాళికాధికారి పి.త్రినాథ్, డీఎల్‌డీవో పి.నారాయణమూర్తి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

పారదర్శక ఓటర్ల జాబితా లక్ష్యం

పారదర్శకమైన, దోషరహిత ఓటర్ల జాబితాను రూపొందించడమే లక్ష్యమని నియోజకవర్గ ఈఆర్ఓ, కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు అన్నారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ–2024 ప్రగతిపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. 6, 7, 8 ద్వారా వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువత కూడా కొత్త ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. వచ్చే ఏడాది జనవరి 5వ తేదీన ఓటర్ల తుది జాబితా ప్రచురితమవుతుందన్నారు. సమావేశంలో ఏ ఈఆర్వోలు కోన శ్రీనివాస్, మురళీకృష్ణ, హరిదాస్, నాగశాస్త్రులు, జాన్ బాబు, వరహాల బాబు, రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు ఎంజీకే కిశోర్ (వైఎస్సార్ సీపీ), ఓమ్మి బాలాజీ, గదుల సాయిబాబా (టీడీపీ), అప్పారావు (బీఎస్పీ), పలివెల వీరబాబు (సీపీఐ) తదితరులు పాల్గొన్నారు.

శ్రీపీఠానికి పోటెత్తిన మహిళలు



మహాశక్తి యాగంలో భాగంగా దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

ఘనంగా కుంకుమ పూజలు, దీపోత్సవం



శ్రీపీఠంలో భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న పరిపూర్ణానంద స్వామి

కాకినాడ రూరల్: రమణయ్యపేట శ్రీపీఠంలో మహాశక్తి యాగానికి మహిళలు మంగళవారం పోటెత్తారు. పరిపూర్ణానంద స్వామి దివ్య ఆశీస్సులతో యాగం 8వ రోజుకు చేరుకుంది. శతకోటి లలితా కుంకుమార్చనల్లో భాగంగా దాదాపు 25 లక్షల కుంకుమార్చనలకు చేరుకుంది. ఎనిమిదో రోజు ఉదయం నక్షత్ర పూజ, తిథి పూజ, అనంతరం లలితా కుంకుమార్చనలు నిర్వహించారు. కుంకుమార్చనల వేదికపై ఆశీనులైన పరిపూర్ణానంద స్వామి, అన్నవరం చిదంబరశాస్త్రి భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. సాయంత్రం కోటి దీపోత్సవ వేదిక వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, పార్వతీ పరమేశ్వరుల ఊరేగింపు అనంతరం దీపోత్సవం నిర్వహించారు. కుంకుమ పూజలకు వచ్చే మహిళల సంఖ్య పెరగడంతో రెండో షెడ్‌ను ఏర్పాటు చేశారు. కుంకుమ పూజలో ఎమ్మెల్యే భార్య మహాలక్ష్మి, జిల్లా ఎస్పీ భార్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సనాతన ధర్మ ప్రచార వారోత్సవాలు

పిఠాపురం: శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సనాతన ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం ఆలయంలో అనఘాదేవి పూజలు నిర్వహించారు. పిఠాపురానికి చెందిన భక్త బృందం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొని పూజలు నిర్వహించారు. నియోజకవర్గంలో వారం రోజుల పాటు అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ ఈఓ ఆర్.సౌజన్య తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ రెడ్డెం జనార్దనరావు, భక్తులు పాల్గొన్నారు.



అనఘాదేవి పూజ చేస్తున్న అర్చకులు